క్లుప్తంగా

సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించుకోవాలి



నెక్కొండ : సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు సీఈఐఆర్ పోర్టల్ వినియోగించుకోవాలని ఎస్సై మహేందర్ కోరారు. మండలానికి చెందిన భూక్య చిన్ని, గోపగాని శ్యాంసుందర్ గతంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మీడియాతో మాట్లాడారు. చిన్ని, శ్యాంసుందర్ గతంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకుని సీఈఐఆర్ మొబైల్ మిస్సింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ క్రమంలో పోర్టల్ ద్వారా సదరు మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్టు వివరించారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



పర్వతగిరి : విద్యుదాఘాతానికి గురై దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని తూర్పుతండాలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. తండాకు చెందిన బాదావత్ చక్రు సాకుతున్న దుక్కిటెద్దులు వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోటే తన దుక్కిటెద్దు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని బాధిత రైతు చక్రు వాపోయాడు. బాధిత రైతుకు పరిహారం చెల్లించాలని రైతులు, తండావాసులు కోరుతున్నారు.

కారు అదుపుతప్పి ఒకరికి గాయాలు



నల్లబెల్లి : కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లగా ఒకరికి గాయాలైన ఘటన మండలంలోని రుద్రగూడెం శివారులోని జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ములుగు జిల్లాలోని వెంకటాపూరం మండలం నుంచి కనకపల్లి గణేశ్ అతని స్నేహితులతో కలిసి కారులో నర్సంపేటకు వస్తుండగా రుద్రగూడెం శివారులో జాతీయ రహదారి మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి సూచిక బోర్డుకు ఢీకొని వ్యవసాయ భూముల్లోకి దూసుకెళ్లింది. కాగా కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందరూ ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌ను 108 వాహనంలో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ



సంగెం : మండలంలోని గొల్లపల్లికి చెందిన పేరబోయిన రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన్ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, ఆస్పత్రిలో అందుతున్న వైద్యం గురించి రాజును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. రాజుకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం వైద్యులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, పరకాల అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రాయపర్తి : మండలంలోని కొండూరు గ్రామ మాజీ సర్పంచ్ కక్రర్ల సరిత రవీందర్‌రెడ్డి దంపతుల చిన్న కుమారుడు కరుణాకర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత కరుణాకర్ మృతదేహానికి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

అటవీ మొక్కల పెంపకం అదుర్స్

- అంతరించిపోతున్న జాతుల సంరక్షణకు చర్యలు
- అశోక్‌నగర్‌లో నర్సరీ

ఖానాపురం : అటవీ జాతి మొక్కల సంరక్షణ చర్యల్లో భాగంగా ఆ శాఖ ఆధ్వర్యంలో ఏటా ప్రత్యేకంగా మొక్కల పెంపకం చేపట్టడం పరిపాటి. స్థానిక నర్సరీలో మొక్కలను జాగ్రత్తగా పెంచి వాటిని అటవీ ప్రాంతాల్లో నాటి కాపాడే దిశగా అటవీ అధికారులు చొరవ తీసుకుంటూ సఫలీకృతం అవుతున్నారని చెప్పక తప్పదు. మండలంలోని అశోక్‌నగర్‌లోని ఫారెస్ట్ నర్సరీలో 32 రకాల అటవీ జాతి మొక్కల పెంపకం అదిరిపోతోందంటూ సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. అంతరించిపోతున్న అటవీ జాతి మొక్కల సంరక్షణకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతుండడం కళ్లకు కడుతోంది. ఇది ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేకంగా చెప్పవచ్చు.

మండలంలోని అశోక్‌నగర్ ఫారెస్ట్ నర్సరీలో అటవీ శాఖ అధికారులు ఏటా మొక్కల పెంపకాన్ని పకడ్బందీగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుత సంవత్సరం కూడా వనమహోత్సవానికి మొక్కల పెంపకం చేపట్టారు. ఇందులో సుమారు 50 వేల మొక్కలను రోడ్ల వెంట నాటే దిశగా పెంచుతున్నారు. వాటితోపాటు అంతరించిపోతున్న విలువైన అటవీ జాతులను సైతం కాపాడుకునే చర్యల్లో భాగంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో 32 రకాల అటవీ జాతి మొక్కలను సుమారు 35 వేల సంఖ్యలో చేపట్టారు. వీటిలో నల్లమద్ది, ఏరుమద్ది, నేరేడు, జిన్న, మారేడు, వేప, నెమలినార, కానుగు, మహాగని, ఇరికి, నీటి కానుగ, రావి,



నర్సరీలో పెంచుతున్న అటవీజాతి మొక్కలు

మర్రి, జువ్వి, చింత, సీమచింత, సీతాఫలం, సండ్ర, బిల్లుడు, చెన్నంగి, వెలగ, తానితో పాటు మరికొన్ని అటవీ జాతులను పెంచుతున్నారు. వీటిని వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా జూన్‌లో పాకాల అటవీ ప్రాంతంలో నాటనుండడం గమనార్హం.

మొక్కలకు జీవామృతం

నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మొక్కలను సంరక్షిస్తున్నారు. నాటిన మొక్కలకు వారానికోమారు జీవామృతం అందిస్తున్నారు. ఒక్కో మొక్కకు రెండు లీటర్ల నీటిలో లీటరు జీవామృతం కలిపి కూలీల సహకారంతో అందిస్తున్నారు. మొక్కలకు ఎప్పటికప్పుడు స్ప్రింక్లర్లతోనూ నీరందిస్తున్నారు. జీవామృతం కోసం ప్రత్యేకంగా నీటి సంపులను ఏర్పాటు చేసి తయారీ చేస్తుండడం ఇక్కడ విశేషం.



స్ప్రింక్లర్లతో నీరందిస్తున్న దృశ్యం

అంతరించిపోకూడదనే పెంపకం

అటవీ జాతి చెట్లు అంతరించిపోకూడదనే లక్ష్యంతోనే అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏటా నర్సరీలో 32 రకాల అరుదైన మొక్కలను పెంచుతున్నాం. భవిష్యత్ తరాలకు అటవీ జాతుల ప్రాశస్త్యం తెలియాల్సిన అవసరం ఉంది. ఆ లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. వనమహోత్సవ కార్యక్రమాల్లో నాటిన అటవీ జాతులతోపాటు అవెన్యూ ప్లాంటేషన్ కోసం మొక్కలు సిద్ధం చేస్తాం. అటవీ ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షిస్తాం.

-రవికిరణ్, ఎఫ్‌ఆర్‌ఓ, నర్సంపేట

ఖాళీ స్టిక్కర్లు అతికిస్తే లాభమేంటి?

- ఎన్యుమరేటర్లపై జెడ్పీ సీఈఓ రాంరెడ్డి ఆగ్రహం
- రేపటి నుంచి సర్వే ప్రారంభించాలని ఆదేశం

సాక్షి నెట్‌వర్క్ : కులగణన సర్వేలో భాగంగా ఇళ్లకు ఖాళీ స్టిక్కర్లు అతికిస్తే ఏం లాభముంటుందని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి ఎన్యుమరేటర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, వెంకటాపురం, నల్లబెల్లి, ఖానాపురం, నర్సంపేట మండలాల్లో గురువారం ఆయన పర్యటించారు. వెంకటాపురం గ్రామంలో ఇళ్లకు ఖాళీ స్టిక్కర్లను అతికించగా ఎన్యుమరేటర్లపై మండిపడ్డారు. స్టిక్కర్లపై వార్డు నంబర్, యజమాని పేరు, ఎన్యుమరేటర్ బ్లాక్ నంబర్, అవసరమైతే యజమాని ఫోన్ నంబర్ రాయాలని సూచించారు. సర్వేకు వెళ్లిన క్రమంలో యజమాని లేకుంటే నంబర్‌కు ఫోన్ చేసే అవకాశం ఉంటుందన్నారు. శుక్రవారంలోగా స్టిక్కరింగ్ పూర్తిచేసి శనివారం నుంచి సర్వే ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామాల్లో కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మదన్నారు. సర్వేకు వస్తున్న ఎన్యురేటర్లకు ప్రజలు స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఆయన వెంట జిల్లా ప్లానింగ్ అధికారి గోవిందరాజన్, దుగ్గొండి ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏఎస్‌ఓ పవన్‌కుమార్, నల్లబెల్లి ఎంపీడీఓ నర్సింహమూర్తి, ఏఎస్‌ఓ అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ధర్మేందర్, పద్మనాభస్వామి, ఖానాపురం స్పెషల్ ఆఫీసర్ సౌజన్య, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీఓ అంబటి సునీల్, నర్సంపేట ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ రామ్మోహన్, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

సక్రమంగా నిర్వహించాలి : డీపీఓ

సంగెం : గ్రామాల్లో సమగ్ర సర్వేను సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన (డీపీఓ) సూచించారు. మండలంలోని కాపులకనిపర్తి, గవిచర్ల, రామచంద్రాపురం, షాపూర్, తీగరాజుపల్లి, సోమ్లతండాను గురువారం ఆమె సందర్శించి ఇంటింటా స్టిక్కరింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లడుతూ ఎన్యుమరేటర్లు పక్కా సమాచారం నమోదు చేయాలని, ప్రతి ఇంటికి



దుగ్గొండి : ఎన్యుమరేటర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ సీఈఓ రాంరెడ్డి



సంగెం : రామచంద్రాపురంలో ఎన్యుమరేటర్లతో మాట్లాడుతున్న డీపీఓ కల్పన

స్టిక్కరింగ్ వేయాలని సూచించారు. సర్వేలో ఏమైనా సమస్యలున్నాయా, స్పష్టమైన సమాచారం పొందుపరుస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ, మండల ప్రత్యేకాధికారి వేదవతి, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

చెన్నారావుపేట/పర్వతగిరి : సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేక అధికారులు బాలకృష్ణ, నీరజ, ఎంపీడీఓలు శ్రీవాణి, మాలోతు శంకర్ నాయక్ కోరారు. చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల్లోని గ్రామాల్లో స్టిక్కరింగ్‌ను వారు పరిశీలించి మాట్లాడారు. ప్రజలు సర్వే బృందానికి పూర్తి వివరాలు అందించాలని సూచించారు. ఎన్యుమరేటర్లు వివరాలను పరిశీలించిన తర్వాతే సంతకం చేయాలని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీఓ పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు చేరాలు, వీరన్న, దివ్య, పాషా, సదానందం, సీఆర్‌పీ కందిక శిల్ప, కారోబర్ కరెడ్ల రాజు, పడిదం సునీల్, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నర్సంపేట : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అంగడి రోడ్డులోని వాసవీ ఫంక్షన్ హాల్ ఏరియాలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక వరంగల్ కమిటీ సభ్యులు గురువారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఓంప్రకాశ్ ఆచారి మాట్లాడారు. కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం అనాదిగా ఆచారంగా వస్తోందని తెలిపారు. దీపాలు వెలిగించడంలోని జ్ఞానాన్ని సమాజంలోని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేదిక కమిటీ సభ్యులు కిరణ్‌చారి, శంకర్, రావణ్‌చారి, విక్రమ్, నిర్మల, త్రైతశ్రీ, అక్షయ, శశిరేఖ, రోహిణి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.


నేడు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ మేళా

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల కోసం స్థానిక పోస్టాఫీసులో నేడు (శుక్రవారం) డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ మేళా నిర్వహించనున్నట్లు పోస్టల్ శాఖ స్థానిక సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుచేందర్, సబ్ పోస్ట్‌మాస్టర్ సురేశ్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పెన్షనర్లు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కోసం ట్రెజరీకి, బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇళ్ల వద్దే పోస్ట్‌మాన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ పొందచ్చని పేర్కొన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా రూ.70ల రుసుము చెల్లించి ఆధార్ అనుసంధాన బయోమెట్రిక్ ద్వారా కాగిత రహిత లైఫ్ సర్టిఫికెట్ అందజేస్తున్నట్లు తెలిపారు. సర్టిఫికెట్ కోసం పెన్షనర్లు పీపీఓ నంబర్‌తోపాటు బ్యాంకు పాస్ బుక్కు, ఈపీఎఫ్ ఐడీ, మొబైల్ నంబర్, ఆధార్ తదితర వివరాలు తెలియజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం పోస్ట్‌మ్యాన్‌ను లేదా పోస్ట్ ఆఫీస్‌ను సంప్రదించాలని కోరారు.

డీఎస్‌పీ పాదయాత్రను విజయవంతం చేయాలి

నర్సంపేట : తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపన ధ్యేయంగా ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టనున్న 15వేల కిలోమీటర్ల మాభూమి మహాపాదయాత్రను విజయవంతం చేయాలని స్థానిక మండల కన్వీనర్ వంగాల శివకృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రజలకు ఉచిత విద్య, వైద్యం ఉపాధి, భూమి, ఇల్లు సాధించే దిశగా పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. పాలకుల తప్పుడు విధానాలపై అణగారిన ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేయడంతోపాటు పీడిత వర్గాలకు రాజ్యాధికార మాటలు చేరవేసేలా డాక్టర్ విశారదన్ పాదయాత్ర చేపడుతున్నారని పేర్కొన్నారు. పాదయాత్రతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి విముక్తి కలుగనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట



మాట్లాడుతున్న ఎస్సై చందర్

వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారానే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని స్థానిక ఎస్సై చందర్ తెలిపారు. మండలంలోని కొత్తపెల్లిలో గురువారం రాత్రి నిర్వహించిన కళాజాతలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, రైతుల ఆత్మహత్యలు, గంజాయి రహిత సమాజ నిర్మాణం, డయల్ 100, బాల్య వివాహాలు, తదితరాలపై ప్రజలను చైతన్యవంతం చేసేలా నృత్యాలు, పాటలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై చందర్ మాట్లాడారు. కొంత కాలంగా సైబర్ నేరాలుగా పెరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. అమాయకులను నేరగాళ్లు మోసగిస్తున్నారని చెప్పారు. మొబైల్‌కు వచ్చే ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని, తెలియని లింకులను ఓపెన్ చేయొద్దని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడినట్టు గుర్తిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంచి నివారణ దిశగా పోలీసులకు సహకరించాలని సూచించారు.

ప్రజాపోరాటాలే కమ్యూనిస్టుల కర్తవ్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు నిర్మించడమే కమ్యూనిస్టుల కర్తవ్యమని ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ మాషుక్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన ఆ పార్టీ జాతీయ సెమినార్‌కు మండలంలోని నర్సంపేట, మాదన్నపేట, రాజపల్లె, నాగుర్లపల్లి, తదితర గ్రామాల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజమౌళి, మాషుక్ మాట్లాడారు. ‘ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మతోన్మాద ఫాసిస్టు కార్పొరేట్ శక్తుల నుంచి ప్రమాదం, కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం’ అంశంపై జాతీయ సెమినార్ జరగనుందని చెప్పారు. బూర్జువా పార్టీల పాలనలో ప్రజలు పీడించబడతారని, కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వాలు లోపాయికారీగా వ్యవహరిస్తాయని తెలిపారు. కమ్యూనిస్టుల పాలన వస్తేనే అంతరాలు లేని సమాజం నిర్మితమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కేశెట్టి సదానందం, ఏఐఎఫ్‌డీఎస్ డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, నాయకులు సుధ, అనుమాల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను కొనసాగిస్తాం

ఖానాపురం : అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ(ఎంఎల్) నాయకుడు రాంచందర్ తెలిపారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చిలుకమ్మనగర్‌లో ఆ పార్టీ జెండాను ఆయన గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటంలో అనేక మంది ప్రాణాలర్పించి అమరులయ్యాని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాము, దేవ, రవి, రాజు, దస్రు, లక్ష్మి, అశోక్, రామోజీ, వీరన్న, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఐనవోలు : ఎంఈఓగా గతంలో విధులు నిర్వహించిన వెంకటేశ్వర్‌రావును ఎంఆర్‌సీలో ఎంఈఓ పులి ఆనందం ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, విద్యావారధి జిల్లా అధ్యక్షుడు సారయ్య, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీహర్షుడు, సుధాకర్, సీఆర్‌పీలు రేవతి, రాజ్‌కుమార్, వసంత పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనా విధానమే ధ్యేయం



నర్సంపేట రూరల్ : పరీక్ష రాస్తున్న విద్యార్థులు



నెక్కొండ: ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న టీచర్లు

నెక్కొండ : విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చేలా చెకుముకి పేరుతో సైన్స్ సంబురాలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గుపల్లి శ్రవణ్ కుమార్ తెలిపారు. మండలంలోని అప్పల్‌రావుపేటలోని ప్రభుత్వ హైస్కూల్ గురువారం నిర్వహించిన పాఠశాల స్థాయి చెకుముకి పోటీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని హైస్కూళ్లు, గురుకుల పాఠశాలల్లో తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్టు తెలిపారు. ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేసి ఈనెల 21న జరగనున్న మండల స్థాయి పోటీలకు పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాక శ్రీనివాస్, పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు గీత, యాకయ్య, భూలక్ష్మి, వెంకట్రాజం, దయాకర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : మండలంలోని గురిజాలలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో నిర్వహించిన పరీక్షలను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పెద్దిరెడ్డి అర్పిత ప్రారంభించి మాట్లాడారు. పత్రంలోని ప్రశ్నలన్నీ విద్యార్థుల్లో ఆలోచన పెంచేలా ఉంటాయని చెప్పారు. విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాదర్, చంద్రకళ, నాగరాణి, రాయబోస్, రవీందర్, రమేశ్, రాజేశ్, సంతోశ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం సరికాదు



రైతులతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని ఇల్లందలోని రైతుల కల్లాలను గురువారం ఆయన సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ధాన్యం కొనుగోలులో సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడారు. పలు చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నెల రోజులు కావస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించలేదని చెప్పారు. ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ఇస్తామన్న హామీని ప్రభుత్వం మోసపూరిత విధానంతో నీరుగార్చిందని తెలిపారు. బోనస్ ఇవ్వకపోగా కొనుగోళ్లు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక



కండువా కప్పుతున్న సారంగపాణి

నల్లబెల్లి : మండలంలోని బుచ్చిరెడ్డిపల్లికి చెందిన బీజేపీ నాయకులు గుగులోత్ యాకూబ్ నాయక్, భూక్య రమేశ్ నాయక్ బీఆర్‌ఎస్‌లో గురువారం చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సారంగపాణి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. పేదలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసినట్టు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలనూ విస్మరించాయని చెప్పారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భూక్య సంగులాల్, లూనావత్ వెంకన్న, ఊరటి అమరేందర్, ఆకుల సాంబరావు, లూనవత్ దేవ్‌సింగ్, బానోత్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత కీలకం



విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ ఉదయ్‌రాజ్

పర్వతగిరి : ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంలో శుభ్రత కీలకమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌రాజ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాల, బీసీ హాస్టల్‌లో గురువారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్‌రాజ్ మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను సరైన రీతిలో శుభ్రం చేసుకోవాలని చెప్పారు. జ్వరం, దగ్గు, జలుబు, చర్మ వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 70 మంది విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఏఎన్‌ఎంలు ఎస్తేర్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రతినెలా వృద్ధులకు వైద్యసేవలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సరోజ

చెన్నారావుపేట : వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు ప్రతినెలా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు వృద్ధులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యురాలు డాక్టర్ సరోజ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. వృద్ధుల సంక్షేమానికి సంఘం పాటుపడుతోందని చెప్పారు. వృద్ధుల సమస్యలను సంఘం ఆధ్వర్యంలో పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. అనంతరం డాక్టర్ సరోజ మాట్లాడారు. వృద్ధులు ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చలికాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.